# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- నాణ్యమైన జీవనానికి యోగాను నిత్య జీవితంలో ఒక భాగం చేసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రాష్ట్రంలో డీఎస్సీ నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- తోతాపూరి మామిడి రైతులకు న్యాయమైన ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని మంత్రి కె. అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.
- ఉత్తర కోస్తాంధ్రలో రేపు కొన్ని చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================

నాణ్యమైన జీవనానికి యోగా మనకు వారసత్వంగా అందిన ఓ అమూల్యమైన సంపద అని, దానిని ప్రతీ ఒక్కరూ అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. యోగాంధ్ర పోర్టల్ ను వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తో కలిసి ముఖ్యమంత్రి ఈ రోజు రాష్ట్ర సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 21 వ్యాధులకు సంబంధించి యోగాసనాల వీడియోలను ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు రూపొందించారని, అవన్నీ పోర్టల్ లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధించాలంటే యోగాంధ్ర చాలా ముఖ్యమని, ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు 14 రోజుల పాటు యోగా కార్యక్రమాలను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

అదే విధంగా రాష్ట్రంలో అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయానికి ప్రపంచంలోనే అతిపెద్ద పర్యావరణ పురస్కారమైన ‘ఫుడ్ ప్లానెట్ ప్రైజ్’ వరించడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో నూరు శాతం ప్రకృతి వ్యవసాయం జరిగేలా చూస్తామన్నారు.

=====================

తోతాపూరి మామిడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు న్యాయమైన ధర లభించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తోతాపూరి మామిడి ప్రస్తుత సీజన్ పరిస్థితులు, మామిడి గుజ్జు (పల్ప్) ప్రాసెసింగ్, కొనుగోలు ఏర్పాట్లపై పల్ప్ పరిశ్రమలు, బాట్లింగ్ కంపెనీలతో మంత్రి ఈరోజు వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 78 వేల హెక్టార్లలో తోతాపూరి సాగు జరుగుతోందని, ఈ పంటపై వేలాది మంది రైతుల జీవనోపాధి ఆధారపడి ఉందన్నారు. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఈ ఏడాది కొంత మేర దిగుబడి తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. నాణ్యమైన ప్రతి పండును కొనుగోలు చేస్తాం.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు.

=====================

గోదావరి పుష్కరాల్లో పాల్గొనే భక్తుల వైద్య అవసరాల నిమిత్తం స్థానికంగా ఉన్న 3 ఆసుపత్రులను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా కొవ్వూరులోని ప్రాంతీయ ఆసుపత్రి, నిడదవోలు, మండపేటలలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్సీ)ల అదనపు నిర్మాణాలు, సౌకర్యాల కోసం 5 కోట్ల 63 లక్షల రూపాయల వ్యయంతో రూపొందించిన ప్రణాళికకు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈరోజు ఆమోదం తెలిపారు. ఈ నూతన ప్రణాళిక ప్రకారం మండపేట సీహెచ్సీ అభివృద్ధి కోసం 3 కోట్ల 75 లక్షల రూపాయలతో పలు పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం 30 పడకలు ఉన్న ఈ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయనున్నారు. అదే విధంగా నిడదవోలు సీహెచ్సీకి కోటి రూపాయలు, కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి 88 లక్షల రూపాయలు ఖర్చు చేయనున్నారు.

=====================

పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, సహజ వనరుల సంరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ సూచించారు. పరిశుభ్రమైన, హరిత వాతావరణం భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (APPCB) విశాఖపట్నం రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఈరోజు ఆయన కలెక్టరేట్ లో జిల్లా ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. ప్లాస్టిక్ కాలుష్యం, వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం, నేల కాలుష్యం, నీటి కాలుష్యం, నిర్మాణ వ్యర్థాలు వంటి సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు.. ఎక్కువ చెట్లు నాటడం, ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్‌ను నిరాకరించడం, చెత్తను వేరువేరుగా సేకరించడం, నీటిని ఆదా చేయడం, పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించడం వంటి సంరక్షణ చర్యలను ఈ పోస్టర్‌లో వివరించారు.

విరామం

=====================

రాష్ట్రంలో ఎంతో పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామక ప్రక్రియపై అసత్య ప్రచారం చేస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత ఆక్షేపించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రస్తుతం 3 లక్షల 11 వేల మంది ఉపాధ్యాయులు రాష్ట్రంలో పని చేస్తున్నారని చెప్పారు. తాను కూడా ఒక ఉపాధ్యాయురాలిగా గతంలో పని చేసానని, డీఎస్సీ ప్రక్రియ గురించి తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తి అయిన తొమ్మిది నెలలు తర్వాత ఎంపిక అయిన అభ్యర్థులు అందరూ సంతోషంగా ఉద్యోగం చేస్తున్న సమయంలో ఇలా గందరగోళం సృష్టించడం సబబు కాదని తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకూడదని అత్యాధునిక సాంకేతికతతో ప్రశ్నా పత్రాలను తయారు చేశారని హోం మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=====================

డీఎస్సీ అక్రమాలు, ఉల్లంఘునలపై సీబీఐ చేత ఎంక్వైరీ చేయించాలని వైఎస్సార్సీపీ డిమాండ్ చేస్తోందని ఆ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డిని పలువురు డీఎస్సీ-2025 అభ్యర్థులు ఈరోజు కలిశారు. పరీక్ష నిర్వహణ, ఎంపికలో చోటు చేసుకున్న అనేక అంశాలను వారు జగన్ కు వివరించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు అండగా ఉంటామని, బాధిత అభ్యర్థుల న్యాయ పోరాటాలకు తమ పార్టీ తోడుగా ఉంటుందని జగన్మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

=====================

నిత్యం సైకిల్ తొక్కడం వల్ల శారీరిక, మానసిక దృఢత్వం పెరుగుతుందని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గ సభ్యులు ఎం.సాయి రామరాజు అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవ సందర్భంగా కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ  శాఖ పరిధిలోని `మేరా యువ భారత్` ఆధ్వర్యంలో విశాఖపట్టణంలోని ఉక్కు నగరంలో ఈరోజు నిర్వహించిన సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరికీ నిత్య జీవితంలో సైకిల్ ఒక భాగం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఇక మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు మాట్లాడుతూ... దేశ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందన్నారు. అందులో భాగంగా సైకిల్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు తిరిగి సైకిల్ అలవాటు చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

=====================

నైరుతి రుతుపవనాలు రేపటికి అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మిగిలిన ప్రాంతాలలోకి మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉతర కోస్తాంధ్రలో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని, ఈదురు గాలులు గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వెల్లడించింది.

=====================

పోలవరం జిల్లా దేవీపట్నం మండలం గంగంపాలెం పరిసర గ్రామాల్లో గత రెండు రోజులుగా సంచరిస్తున్న పెద్దపులి పశువులపై దాడి చేయడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ రోజు ఉదయం తెల్లవారు జామున పశువుల మందపై దాడి చేసిన పులి 12 ఆవు దూడలు, ఒక గేదె దూడను చంపేసినట్లు జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు ధృవీకరించారు.

=====================
=====================